క్లుప్తంగా

వికసించిన ఫ్లేమింగ్ టార్చ్



స్థానిక రాణిచంద్రమణిదేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న జీవ వైవిధ్య ఉద్యానవనంలో అరుదైన ఫ్లేమింగ్ టార్చ్ పుష్పం విరబూసింది. బిల్‌బెర్జియా పిరమిడాలిస్‌గా వ్యవహరించే ఈ పుష్పం ఎంతో ఆకట్టుకుంటోంది. పార్క్‌ను సందర్శించే విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తోంది.
- ఏయూ క్యాంపస్

క్యాన్సర్ రోగికి సాయం



రూ.5 వేలు సాయం అందిస్తున్న అక్కరమాని వెంకటరావు

ఎంవీపీ కాలనీ: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మూలపాలెంకు చెందిన పుక్కళ్ల అమ్మోరు అనే వ్యక్తికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు స్థానిక పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ఉదయం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. చికిత్స నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సహకారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వాసుపల్లి ఎల్లాజీ, ఉమ్మిడి కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

'పాపులర్ పొలిటికల్ లీడర్ మోదీ'



సమావేశంలో మాట్లాడుతున్న వివేక్

ఎంవీపీకాలనీ: ప్రపంచంలోనే పాపులర్ పొలిటికల్ లీడర్‌గా ప్రధాన మోదీ కీర్తి గడించారని బీజేపీ మాజీ ఎంపీ జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 9 ఏళ్ల మోదీ పాలనపై పెద్ద ఎత్తున ప్రచారం కల్పిస్తున్నామన్నారు. కోవిడ్ సమయంలో 140 కోట్లు ప్రజలున్న భారతావనిని ప్రధాని మోదీ నడిపించిన తీరు ప్రపంచానికే ఆదర్శమన్నారు. డిజిటల్ పేమెంట్స్‌లో దేశాన్ని ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలిపారన్నారు. దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు రక్షణ రంగ ఉత్పత్తుల ఎగుమతుల దిశగా దేశాన్ని నడిస్తున్నారన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో విజయం సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం

సీతంపేట: మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం సాయంత్రం లలితానగర్ లలితా పీఠంలో కాళీ కాలభైరవులకు అఘోర మృత్యుంజయ పాశుపత అభిషేకం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పీఠం అర్చకుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అభిషేకాలు జరిపించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం జరుగుతుందన్నారు.

బతుకుపోరుకు.. వేళాయె

- ఈ నెల 14తో ముగిసిన వేట విరామం
- వేటకు పెద్ద ఎత్తున సన్నద్ధమవుతున్న మత్స్యకారులు
- మత్స్యకార భరోసా, డీజిల్ రాయితీపై హర్షం



జాలరిపేట తీరంలో వేటకు సిద్ధంగా ఉన్న వందలాది పడవలు



సంప్రదాయ పడవల్లో వేటకు వెళ్తున్న మత్స్యకారులు

ఎంవీపీ కాలనీ: బతుకుపోరుకు మత్స్యకారులు సన్నద్ధమవుతున్నారు. దాదాపు 61 రోజుల విరామం తరువాత తిరిగి జీవన పోరాటానికి సిద్ధమవుతున్నారు. చేపల వేటలో ముందస్తు సన్నద్ధతలో భాగంగా పెద్ద ఎత్తున వలలను సమకూర్చుకుంటున్నారు. అప్పుఘర్, వాసవానిపాలెం, పెదజాలరిపేట ప్రాంతాల్లోని మత్స్యకారులు పెద్ద ఎత్తున ఈ పనిలో నిమగ్నమయ్యారు. సముద్ర చేపలు గుడ్లు పెట్టే సమయం కావడంతో ఏటా ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ప్రభుత్వం అధికారికంగా వేట విరామం ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 61 రోజుల పాటు తూర్పు నియోజకవర్గం పరిధిలోని మత్స్యకారులు వేటకు దూరంగా ఉన్నారు. అయితే ఈ నెల 14వ తేదీతో విరామం గడువు ముగియడంతో వేటకు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రస్తుతం మత్స్యకార కాలనీల్లో ఎక్కడ చూసిన ఈ తరహా ఏర్పాట్లు, సన్నద్ధత కనిపిస్తున్నాయి.

ఆదుకున్న ప్రభుత్వ పథకాలు

తూర్పు నియోజకవర్గంలో అత్యధిక ప్రజానీకం కలిగిన సామాజికవర్గంలో మత్స్యకారులు ఒకరు. చేపల వేటనే జీవనాధారంగా చేసుకొని ఆయా కుటుంబాలు నెట్టుకొస్తున్నాయి. జాలరి ఎండాడ, జోడుగుళ్లపాలెం, వాసవానిపాలెం, శివగణేష్‌నగర్, పెద జాలరిపేటలో అత్యధికంగా మత్స్యకారులు వేటే వృత్తిగా జీవనం సాగిస్తున్నారు. ఆయా గ్రామాల్లో 4 వేల వరకు కుటుంబాలు ఉన్నాయి. జిల్లాలో 2,195 బోట్లు ఉండగా.. అందులో 40 శాతం పైగా ఈ గ్రామాల్లోని మత్స్యకారులే కలిగి ఉన్నట్లు మత్స్యకార శాఖ వెల్లడించింది. సంప్రదాయ పడవలతో పాటు ఇంజిన్ బోట్లు ద్వారా ఇక్కడి మత్స్యకారులు వేటసాగిస్తున్నారు. గ్రూపులుగా ఏర్పడి తెల్లవారు జామునే వేటకు వెళ్తారు. తద్వారా వచ్చే ఆదాయం ద్వారా కుటుంబాలను పోషిస్తున్నారు. అయితే వేట విరామం సమయంలో ప్రభుత్వం అందిస్తున్న మత్స్యకార భరోసా ద్వారా కుటుంబ పోషణకు ఊరట లభించిందని పలువురు మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ పథకం ద్వారా జాలరి ఎండాడ, జోడుగుళ్లపాలెం, వాసవానిపాలెం, శివగణేష్‌నగర్, పెద జాలరిపేట గ్రామాల్లో 3,550 మంది మత్స్యకారులు లబ్ధి పొందినట్టు మత్స్యకార శాఖ అధికారులు తెలిపారు. దీంతో పాటు ప్రభుత్వం వేటకు వెళ్లే బోట్ల ఆపరేటర్లకు స్మార్ట్ కార్డులు అందజేసింది. ఈ కార్డుల ద్వారా మత్స్యకారులు డీజిల్ రాయితీ పొందవచ్చు. ఇలా ప్రభుత్వ పథకాలు, నిర్ణయాలు తమకు అండగా నిలుస్తున్నాయని పలువురు మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు.

కళ తప్పిన ముడసర్లోవ పార్కు



ముడసర్లోవ పార్కులో బురద



పిచ్చి మొక్కలతో ముడసర్లోవ పార్కు

ఆరిలోవ: సుమారు ఏడాది పాటు సుందరంగా దర్శనమిచ్చిన ముడసర్లోవ పార్కు ప్రస్తుతం పిచ్చి మొక్కలతో కళ తప్పింది. బురదమయమై అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడ రిజర్వాయరులో నీరు గ్యాలరీలోకి సరఫరా అయి శుభ్రమవుతుంది. రిజర్వాయరు నుంచి ఆ నీరు గ్యాలరీలోకి చేరడానికి అమర్చిన పైపులైన్ పాడైపోవడంతో పాటు వాల్వ్ వద్ద లీక్ ఏర్పడింది. దీంతో నీరు పార్కులో నెలల తరబడి నిలిచిపోయి బురదగా మారింది. ఇదిలా ఉండగా పార్కులో తరచూ మొక్కలు, పచ్చికను అందంగా కట్ చేస్తుండాలి. కానీ సుమారు రెండు నెలలుగా వాటిని ఎవరూ పట్టించుకోకపోవడంతో అస్తవ్యస్తంగా పెరిగిపోయాయి. ఇప్పటికైనా జీవీఎంసీ ఉద్యాన వన శాఖాధికారులు స్పందించి ఈ పార్కును గతంలో వలే శుభ్రం చేసి, అందంగా తీర్చిదిద్దాలని సందర్శకులు కోరుతున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

బీచ్ రోడ్డు: రామ్‌నగర్‌లోని ఓమ్నీ ఆర్కే ఆస్పత్రి పార్కింగ్ స్థలంలో ఉన్న పిఠాపురం ఎమ్మెల్యే దొరబాబు పీఏ రామకృష్ణకు చెందిన కారు అద్దాలు పగలగొట్టి నగదు, బంగారాన్ని చోరీ చేసిన కేసులో నిందితుడిని మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రావికమతం మండలం కొత్తకోటకు చెందిన మణికంఠ ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. వన్‌టౌన్ ఏరియాలో బంధువులు ఇంటికి వెళ్తున్న సమయంలో పక్కా ప్రణాళికతో మణికంఠను పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీకి గురైన నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. మణికంఠపై గతంలో కూడా అనేక చోరీ కేసులు నమోదై ఉన్నాయన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఫుడ్.. ఫన్.. ఆటో మొబైల్



హ్యాండ్ మేడ్ సోప్ విక్రయ స్టాల్



ర్యాంక్ బ్యాండ్ ప్రదర్శన

ఏయూ క్యాంపస్: విశాఖ నగరవాసులకు, ఆహార ప్రియులకు మంచి వేదిక ఏర్పడింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం పోలమాంబ ఆలయం పక్కనే ఉన్న మైదానంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్, ఆటో ఎక్స్‌పో ఆకట్టుకుంటోంది. విభిన్న ఆహార రుచులను ప్రజలకు పరిచయం చేసేలా యూనికాన్ ఎక్స్‌పో సంస్థ దీనిని ఏర్పాటు చేసింది. రాడిసన్ బ్లూ సంస్థ ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్ ప్రత్యేక రుచులను పరిచయం చేస్తోంది. గిరిజన ప్రాంత ప్రత్యేక ఫుడ్‌గా నిలిచే బ్యాంబూ చికెన్‌తో పాటు, పొటాటోతో చేసిన పలు వంటకాలు, చల్లని పానీయాలు ఇక్కడ విక్రయిస్తున్నారు. నగరానికి చెందిన పలు హోటళ్లు, రెస్టారెంట్‌లకు సంబంధించిన ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌లో భాగంగా శ్రీకాకుళం ప్రాంతంలో తయారు చేసే కొబ్బరి నీరు, వర్జిన్ కోకోనట్ ఆయిల్, కోకోనట్ పౌడర్, కొబ్బరి పాలు, బెంగళూరుకు సంస్థ ఓట్స్‌తో తయారు చేసిన పానీయాలు, రెడీటు కుక్ వంటకాలు ఇక్కడ ప్రత్యేకంగా విక్రయిస్తున్నారు. రసాయనాలు లేని హ్యాండ్‌మేడ్ సబ్బులు, జ్యూట్ బ్యాగ్‌లు వంటివి విశాఖ వాసులను కట్టిపడేస్తున్నాయి. ఆటో ఎక్స్‌పోలో వివిధ సంస్థలు తమ కార్లు, టూ వీలర్లను ప్రదర్శిస్తున్నాయి. భారీ వేదికపై ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. నగరవాసులు స్వయంగా తమ టాలెంట్‌ని ఈ వేదికపై ప్రదర్శించవచ్చునని నిర్వాహకుడు గోపాల్ తెలిపారు.

15వ వార్డులో మలేరియా మాసోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): మలేరియా మాసోత్సవ ర్యాలీని జీవీఎంసీ 15వ వార్డులో శుక్రవారం మలేరియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. సింహాద్రిపురం ప్రాంతంలో ఈ ర్యాలీ సాగింది. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ బి.శ్రీనివాసరావు, మలేరియా అసిస్టెంట్ కె.ఎస్.ఎస్.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చికిత్సతో వంకర పాదాలు నయం



మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

మహారాణిపేట: పుట్టుకతోనే వంకర పాదాలతో ఉన్న పిల్లలకు సరైన చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అన్నారు. శుక్రవారం కేజీహెచ్‌లో క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్టు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వంకర పాదాల చికిత్సపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పాదాలు వంకరగా ఉన్నాయని భయపడొద్దని తెలిపారు. పలు చికిత్సా విధానాల ద్వారా పాదాలను పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ వంకర పాదాలపై వైద్యులకు కూడా అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, రాణిచంద్రమతి దేవి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బి.చక్రవర్తి, డాక్టర్ రుద్ర ప్రసాద్, డాక్టర్ అభిషేక్ తదితరులు కార్యక్రమానికి శిక్షకులుగా వ్యవహరించారు. క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్టు రీజనల్ మేనేజర్ పి.రవికుమార్, స్టేట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బి.శిరీషరాణి, జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జి.జోత్స్న, డాక్టర్ వి.వి.సమత, పి.ప్రియాంక, బి.సాయి కిరణ్, ఇ.శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాలకు చెందిన ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు. అవసరం అయిన వారు (8800020503) నంబర్‌కు కాల్ చేస్తే చికిత్స అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

ఈఆర్‌ఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో కార్మికవర్గం చురుగ్గా పాల్గోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాజు కోరారు. ప్రైవేటీకరణ ఉద్యమం ప్రారంభం నుంచి ఐఎన్‌టీయూసీ చురుగ్గా వ్యవహరిస్తోందన్నారు. శుక్రవారం జరిగిన ఎలక్ట్రికల్ రిపేర్ షాప్ (ఈఆర్‌ఎస్) నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విభాగం నూతన కన్వీనర్‌గా పి.వి.రాజు, అధ్యక్షునిగా కె. అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, పి.ఎస్.ఎస్. ప్రసాద్, బి. శ్రీనివాస్, కార్యదర్శిగా బి. సురేష్, సహాయ కార్యదర్శిగా కె. అప్పలరెడ్డి, కోశాధికారిగా ఎ. నరేష్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అదనపు ప్రధాన కార్యదర్శి బీఎస్ రాజును నాయకులు సత్కరించారు.

తల్లి అదృశ్యంపై కుమార్తె ఫిర్యాదు



ఆదిలక్ష్మి

మద్దిలపాలెం: తన తల్లి కనిపించడం లేదని ఆమె కుమార్తె ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం బర్మాక్యాంప్ దరి ఏఎస్సార్ నగర్‌లో కర్రి ఆదిలక్ష్మి(66) తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. ఈ నెల 14 నుంచి ఆమె కనిపించడం లేదు. చుట్టుపక్కల ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో ఆదిలక్ష్మి కుమార్తె సూర్యకుమారి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



నౌకా నగర్ పాఠశాలలో విద్యా కానుక పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మి

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు నౌకా నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్పొరేటర్ మువ్వల లక్ష్మి స్వయంగా విద్యార్థులకు జగనన్న విద్య కానుక కిట్లను అందజేశారు. అనంతరం మువ్వల లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాల విద్యను బలోపేతం చేసే దిశగా నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారని చెప్పారు. పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారం, షూ, బ్యాగ్ వంటి వస్తువులు ఉచితంగా అందించడం గొప్ప విషయమన్నారు.

ఆరిలోవ: జగనన్న విద్యా కానుక(జేవీకే) కిట్లను పెదగదిలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పంపిణీ చేశారు. 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి పాల్గొని విద్యార్థులకు ఈ కిట్లు అందజేశారు. క్రమశిక్షణతో చదువుకోవాలని ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తి మందారెడ్డి, పాపారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

హాస్టల్‌లో పంట పండింది



హాస్టల్‌లో చెట్టుకు కాసిన మామిడి కాయను వీసీకి బహూకరిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం విదేశీ విద్యార్థినుల హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులు స్వయంగా పలు మొక్కలు నాటి పెంచుతున్నారు. గత సంవత్సరం కొన్ని మామిడి మొక్కలు నాటారు. ఈ సంవత్సరం వీటిలో ఒక మొక్క కాయలు కాయడం ప్రారంభించింది. ఈ మేరకు మొక్కకు కాసిన కాయను పలువురు వియత్నం విద్యార్థులు ప్రత్యేకంగా తీసుకువచ్చి వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డికి బహూకరించారు. వియత్నంకు చెందిన పరిశోధకులు, విద్యార్థులు స్వయంగా పలు రకాల ఆకు కూరలు, కూరగాయలను హాస్టల్ ఆవరణలో సాగు చేస్తున్నారు. తమ దేశానికి సంబంధించిన పలు మొక్కలు సైతం తీసుకువచ్చి ఇక్కడ హాస్టల్ చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశంలో పెంచుతున్నారు. వారి ఆసక్తిని వీసీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ డాక్టర్ రాజమాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

కణితి పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష



కణితి పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయి సందర్శనకు వెళ్లినప్పుడు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో విధిగా నమోదు చేసి వెళ్లాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యాక్సిన్, ఓపీ రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రణాళికాబద్ధంగా బుధవారం హెడ్ క్వార్టర్‌లోను, శనివారం పీహెచ్‌సీ పరిధిలో వ్యాక్సినేషన్ వేయాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాన్నంతా పరిశీలించారు. పీహెచ్‌సీ కొత్త భవనం సివిల్ వర్క్స్ కోసం ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో చర్చించారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్యాధికారి డాక్టర్ బి.ఉమావతి, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ అర్చకులు గిరి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘోషా ఆసుపత్రి వద్ద రూ.10కే భోజనం



రూ.10కే భోజనం అందిస్తున్న రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధులు

జగదాంబ : ఘోషా ఆసుపత్రి వద్ద స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ, రౌండ్ టేబుల్ సంస్థలు సంయుక్తంగా రూ.10కే భోజనం అందిస్తున్నాయి. దూర ప్రాంతాల నుండి ఆసుపత్రికి వచ్చే వారికి సేవ చేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ తెలిపారు. అంతే కాకుండా ఎండలు ఎక్కువ ఉన్న కారణంగా భోజనంతో పాటు ఆ పది రూపాయలకే పోషక విలువలు కలిగిన రాగి జావా కూడా అందిస్తున్నామన్నారు. దీనిపై ప్రజలు, పేషెంట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు డి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

41వ ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక

దాబాగార్డెన్స్: ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 6న అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా 41వ ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు నల్లూరి నూకరాజు తెలిపారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక సేవలో భాగంగా ఎటువంటి లాభాపేక్ష లేకుండా నగరంలోని ఆర్యవైశ్యులు అందించిన విరాళాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఒకసారి ఒక పెళ్లి సంబంధం చూడడానికి సమయం, ధనం ఎక్కువగా ఖర్చవుతుందని, కానీ ప్రస్తుత జీవన విధానంలో ఈ విధమైన వధూవరుల పరిచయ సభల వల్ల ఒకేసారి ఎక్కువ మంది నుంచి తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే అవకాశం ఉన్న ఇటువంటి కార్యక్రమాన్ని ఆధునిక స్వయంవరాలుగా అభివర్ణించవచ్చని పేర్కొన్నారు. ఈ పరిచయ కార్యక్రమం ఆర్యవైశ్యులకు మాత్రమేనని, పరిచయ వేదికలో పాల్గొనే వారు వచ్చే నెల 27లోగా నగదు/ఫోన్‌పే/మనియార్డర్ ద్వారా సంఘ కార్యాలయంలో సంప్రదించి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7780149250 నంబరులో సంప్రదించవచ్చు. సమావేశంలో సంఘం ప్రతినిధులు పూసర్ల సురేష్‌కుమార్, పరిచయ వేదిక ఉప సంఘం చైర్మన్ దుర్గా సోమేశ్వరరావు, పాలూరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.